నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
ఆదివారం | జనవరి 28, 2024 | www.navatelangana.com

అంగన్‌వాడీ ఆయాను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

అంగన్‌వాడీ ఆయా వెంకటమ్మను బీఆర్ఎస్ నాయకులు శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న వెంకటమ్మ జనవరి 26న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకోగా శనివారం ఆయమ్మను బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే అంగన్‌వాడీ కేంద్రం టీచర్ మంజులకు ఉత్తమ అవార్డు వచ్చిందని అన్నారు. ఈ సంవత్సరం ఆయమ్మకు అవార్డు రావడం అభినందనీయమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు విద్యాతో పాటు ఆటపాటలు, చురుకుగా పనిచేసిన అంగన్‌వాడీ సిబ్బందిని గుర్తించి, ఈ అవార్డులు అందించడం జరిగిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు వేతనాలతో పాటు భవనాలు మంజూరు చేసి పిల్లలకు పౌష్టికాహారం అందించినట్లయితే ఆరోగ్యంతో పాటు శరీరకంగా పెరుగుతారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాటిపల్లి సునీతరెడ్డి, నాగారెడ్డి, ఆసం రవి, మేకల రవికాంత్, అభిరాంరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ మంజుల, పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

లేబర్ కార్యాలయం ఎదుట మంచిర్యాల కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడంలో కార్మికశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మంచిర్యాల జిల్లా దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం ఆదిలాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలతో హోరేత్తించారు. 2019 సంవత్సరం నుంచి ఇప్పటివరకు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడంలేదని మండిపడ్డారు. దాదాపు ఐదు సంవత్సరాలు గడిచిపోతున్నా సంబంధితశాఖ అధికారులు సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు కంపెనీ యాజమాన్యాలు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, అనేక సమస్యలతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి గుర్తింపు ఎన్నికలను వాయిదా వేస్తూ రావడం సమంజసం కాదని పేర్కొన్నారు.

ఎంపీ స్థానంపై గురి..!

- బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు
- టికెట్ల కోసం అధిష్టానాల చుట్టూ ఆశావహుల చక్కర్లు
- అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కంటే బీఆర్ఎస్‌కే అధిక ఓట్లు
- ఆసక్తికరంగా మారనున్న లోక్‌సభ సమరం

లోక్‌సభ ఎన్నికల సమరానికి త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది. ఇప్పటి నుంచే ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానమైన ఆదిలాబాద్ పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడం.. అతి త్వరలోనే లోక్‌సభ ఎన్నికలు జరుగనుండటంతో అందరి దృష్టి వీటిపైనే కేంద్రీకృతమైంది. ఆయా పార్టీల నుంచి బరిలో నిలిచేందుకు పలువురు ఆశావహులు సిద్ధమవుతున్నారు. టికెట్ల కోసం పార్టీల అధిష్టానాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకుంటూ టికెట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా ఇది వరకే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన వారితో పాటు కొందరు కొత్త వ్యక్తులు సైతం పార్లమెంటు బరిలో నిలిచేందుకు సిద్ధం కావడం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంటు స్థానంలో బీజేపీ కంటే బీఆర్ఎస్‌కే అధిక ఓట్లు రావడం గమనార్హం.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడం..అధికారం మారిపోవడం చకచక జరిగిపోయాయి. పదేండ్ల పాటు రాష్ట్రాన్ని ఏలిన బీఆర్ఎస్ పార్టీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడి అధికారాన్ని కోల్పోయింది. రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ నూతన ఉత్సాహంతో కనిపిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం అసెంబ్లీ ఫలితాలు తారుమారయ్యాయి. ఇక్కడ బీజేపీ ఏకంగా నాలుగు స్థానాలు గెలుచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సైతం నాలుగు స్థానాలతో సరిపెట్టుకోగా.. బీఆర్ఎస్ రెండింటికే పరిమితమైన విషయం తెలిసిందే. ఇక అన్ని పార్టీల దృష్టి రానున్న లోక్‌సభ ఎన్నికలపైనే కేంద్రీకృతమైంది. ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్ పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఆయా ప్రధాన పార్టీలు భావిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఇక్కడ బీజేపీ సిట్టింగ్ స్థానాన్ని మరోసారి నిలబెట్టుకోవాలని ఆరాటపడుతుండగా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ స్థానాన్ని కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఫలితాలు చవిచూసినా..పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటి పట్టు నిలుపుకోవాలని బీఆర్ఎస్ భావిస్తుండటం ప్రాధాన్యంశంగా మారింది.

బీఆర్ఎస్‌కే అధిక ఓట్లు..!

ఆదిలాబాద్ పార్లమెంటు స్థానంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. సిర్పూర్, ఆసిఫాబాద్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్ ఈ పార్లమెంటు పరిధిలోకి వస్తాయి. ఇందులో సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్ స్థానాలు బీజేపీ గెలుచుకోగా.. ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఖానాపూర్ ఒక్క స్థానాన్ని మాత్రం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. విశేషమేమిటంటే బీజేపీ నాలుగు స్థానాలు గెలిచినా..ఓట్ల పరంగా బీఆర్ఎస్ కంటే తక్కువగానే వచ్చాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో 13,07,985 ఓట్లు పోల్ కాగా..బీజేపీ కంటే బీఆర్ఎస్ 16,515 ఓట్ల మెజారిటీ సాధించింది. ఇందులో బీఆర్ఎస్ 4,65,476 సాధించగా..బీజేపీకి 4,48,961ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 2,52,286ఓట్లు సాధించింది. ఇతరులు 1,41,262 ఓట్లు సాధించారు. ఈ లెక్కన బీజేపీ అధిక సీట్లు సాధించినా..ఓట్ల పరంగా మాత్రం బీఆర్ఎస్‌కే అధికంగా రావడం గమనార్హం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామనే ధీమాతో ఈ లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకోవాలని భావిస్తుండగా.. కేంద్రంలో అధికారంలో ఉండటంతో పాటు సిట్టింగ్ స్థానాన్ని మరోసారి నిలబెట్టుకోవాలని బీజేపీ అనుకుంటోంది. మరోపక్క సీట్లు రాకపోయినా అధికంగా ఓట్లు సాధించామనే ధీమాతో బీఆర్ఎస్ సైతం ఈ స్థానం గెలుచుకోవాలని భావిస్తుండటం ఆసక్తికరంగా మారింది. మరోపక్క ఆయా పార్టీల నుంచి బరిలో దిగేందుకు అనేక మంది ఆసక్తి చూపుతున్నారు. ఇది వరకే పోటీ చేసిన వారితో పాటు కొత్తవారు సైతం బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే పట్టణాలు, మండల కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తుండటం లోక్‌సభ ఎన్నికలను ఆసక్తికరంగా మారుస్తోంది.

వచ్చే నెల 2న జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి..!

- ఇంద్రవెల్లిలో సభ.. నాగోబా ఆలయం సందర్శన
- ముఖ్యమంత్రిగా తొలిసారి జిల్లా పర్యటన
- ఏర్పాట్లు పూర్తిచేస్తున్న అధికారులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు రానున్నారు. ఫిబ్రవరి 2వ తేదీన ఆయన పర్యటన ఖరారైనట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటుచేసిన స్మృతివనం ప్రారంభించడంతో పాటు నాగోబా ఆలయాన్ని దర్శించుకోనున్నట్లు తెలిసింది. మరోపక్క ఇంద్రవెల్లిలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు సభాస్థలిని సిద్ధం చేస్తున్నారు. తాజాగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ఇతర అధికారులు శనివారం ఇంద్రవెల్లిలో సభా స్థలిని పరిశీలించారు. మరోపక్క ఎన్నికల సమయంలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇంద్రవెల్లి నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్‌లో నిర్వహించిన ర్యాలీలో తొలిసారి రేవంత్‌రెడ్డి పాల్గొన్నా.. కొద్ది రోజులకే దళిత, గిరిజన దండోరా పేరుతో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనాలు తరలిరావడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం కనిపించింది.ఈ సభ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది.

ముఖ్యమంత్రిగా తొలి పర్యటన..!

ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి తొలిసారి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నెల 26వ తేదీ నుంచి జిల్లాల పర్యటన చేపడుతానని ఇది వరకే ప్రకటించిన ఆయన తొలిసారి ఇంద్రవెల్లికి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక్కడ నూతనంగా నిర్మించిన స్మృతివనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం నాగోబా ఆలయాన్ని దర్శించుకోని పూజలు చేయనున్నట్లు తెలిసింది.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-పెంబి

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో 36 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు మండలంలోని శేట్‌పల్లి, కొలంగూడాలో రూ.5లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాల భవన ప్రారంభానికి వెళ్లగా శిలా పథకంపై తనపేరు లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనాన్ని ప్రారంభించకుండా వెళ్లిపోయారు. సమయపాలన పాటించాలని, అధికారులైనా నాయకులైన ప్రోటో కాల్ పాటించాలని అన్నారు. అధికారులు ఇష్టం వచ్చిన రీతిలో పని చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు తమ తీరును మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓ సుధాకర్, ఎంపీఓ రత్నాకర్ రావు, సర్పంచ్ రాధా శ్రీనివాస్, సీడీపీఓ సరిత, సూపర్‌వైజర్ నిర్మల, శ్రీలత, కాంగ్రెస్ మండల అధ్యక్షులు స్వప్నిల్ రెడ్డి, నాయకులు తులాల శంకర్, గుడిసె రమేష్, గుగ్గిల భూమేష్, సల్ల ప్రశాంత్ రెడ్డి, వెడ్మ శేఖర్ ఉన్నారు.

నేడు పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన పరీక్షలు నిర్వహించనునట్టు విద్యార్థి సంఘం నాయకులు కొట్నాక్ సక్కు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం జామడ, తాడిహత్నూర్, మాన్యాపూర్, నార్నూర్, భీంపూర్ ఆశ్రమ పాఠశాలలో పరీక్షల నిర్వహణకు విద్యార్థుల వివరణ సేకరించారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థుల భయాలను తొలగించేందుకు ఈ అవగాహన పరీక్షలు నిర్వహిస్తునట్లు తెలిపారు.

ఉత్తమ ఆరోగ్య కార్యకర్తలకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న పిప్పల్‌ధరి సబ్ సెంటర్‌కు సంబంధించిన ముయ్యాలమోతిని, మావల ఏఎన్ఎం నజియాను అంకోలి సిబ్బంది. డా.సర్ఫరాజ్, సుభాష్, యశోదా, వసంత, లక్ష్మీ శ్యామలను సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. డా.సర్ఫరాజ్, బి.సుభాష్‌లు మెమోంటోలు అందించి, వారిసేవలను కొనియాడారు. అలాగే మావల సబ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఏఎన్ఎం నజియాబాను ఉచితంగా చేస్తున్న సేవలను గుర్తించి శాలువాతో సన్మానించి మెమోంటోను అందించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు గంగామణి, ధృపద, ఆరోగ్య సహాయకులు ఈశ్వర్‌రెడ్డి, నారాయణ, ప్రేమ్‌సింగ్, మమత, లలిత, తార, శ్రీదేవి, ఇందుబాయి, ఈశ్వరీదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే సమాచారం ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎవరైనా పోకిరివాళ్లు ర్యాగింగ్ చేస్తే సమాచారమివ్వాలని షీటీం బృందం సభ్యులు తెలిపారు. శనివారం పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల, కళాశాల అమ్మాయిలు పోకిరి వాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా ర్యాగింగ్, చేసిన ఏడిపించిన వెంటపడి వేధించిన, ప్రేమా పెళ్లి అంటూ వెంటపడిన తమకు వెంటనే సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని షీటీం బృందం సభ్యులు సూచించారు. ఫోన్ చాటింగ్, వాట్సాప్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయాలు పెంచుకోవద్దని అన్నారు. వాటి ద్వారా మోసపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇటువంటి నేరాలు జరిగిన వెంటనే షీటీం నెంబర్ 8712659953కి కాల్ చేయాలని, సైబర్ నేరాలు జరుగుతే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. సిటీకి అవతల ఉన్న పిల్లలకు నడుచుకుంటూ వచ్చే పిల్లలకు ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 100కి కాల్ చేయాలని వివరించారు. మైనర్ అమ్మాయిలపై అఘాయిత్యాలు జరిగితే పోక్సో యాక్ట్ కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలిపారు. ఈ ప్రోగ్రాం లో స్కూల్ టీచర్లు, షీటీం బృందం అధికారులు బి.సుశీల, జి.సత్యం మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో శనివారం లబ్ధిదారులు 6 గంటల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. లబ్ధిదారులు తమ వెంట చిన్న పిల్లలు తీసుకురావడం దాదాపు 6 గంటల పాటు బోజనం లేకుండా, ఎమ్మెల్యే కోసం వేచి చూస్తూ అవస్థలు పడ్డారు. ఇదే రోజు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు భూమిపూజ చేశారు. అంతే కాకుండా క్యాంపు కార్యాలయం పూజా కార్యక్రమం ఉండటం వల్ల ఆలస్యంగా కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీకి వచ్చారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి నవిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, కేజీబీవీ అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-ఖానాపూర్

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్దిదారులకు మంజూరు అయినా 36 చెక్కులు పంపిణీ చేశారు. అంతకుముందు మండలంలోని శేట్‌పల్లి, కొలంగూడాలో ఒక్కొక్కటి రూ.5లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభానికి వెళ్లగా నూతన భవనానికి శిలాఫలకం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోలాంగూడాలో శిలాఫలకం లేదని అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించకుండా తిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలని, అధికారులైనా నాయకులైన ప్రోటో కాల్ పాటించాలని అన్నారు. అధికారులు ఇష్టం వచ్చిన రీతిలో పని చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ తీరును మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు స్వప్నిల్‌రెడ్డి, సర్పంచ్ రాధా శ్రీనివాస్, సీడీపీఓ సరిత, సూపర్‌వైజర్ నిర్మల, శ్రీలత, ఎంపీడీఓ సుధాకర్, ఎంపీఓ రత్నాకర్‌రావు, తహసీల్దార్ లక్ష్మణ్, నాయకులు తులాల శంకర్, గుడిసె రమేష్, గుగ్గిల భూమేష్, సల్ల ప్రశాంత్ రెడ్డి, వెడ్మ శేఖర్ ఉన్నారు.

బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించినా మారడం లేదు

- లహరి బస్సుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-హాజీపూర్

బీఆర్ఎస్ పాలన నచ్చకనే ప్రజలు తిరస్కరించారని అయిన నాయకులు మారడం లేదని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల ఆర్టీసీ డిపోకు కొత్తగా మంజూరైన లహరి స్లీపర్ ఏసీ, నాన్ ఏసీ బస్సులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రారంభించారు. శనివారం ఆర్టీసీ డిపోలో పూజలు చేసి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ మంచిర్యాల ప్రయాణీకులకు కొత్త బస్సులు సౌకర్యంగా ఉంటాయని అన్నారు. ఆర్టీసీ డిపోలో పనిచేసే మహిళలకు ప్రత్యేక విశ్రాంతి గది నిర్మించాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఆర్టీసీలో స్థానికంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆరెస్‌ను ప్రజలు తిరస్కరించినా ఇంకా కాంగ్రెస్‌పై దుమ్మెత్తిపోయడం శోచనీయమన్నారు. బీఆరెస్ నేతలు పద్దతులు మార్చుకోకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ది చెబుతారని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేయడం లేదని తెలిపారు. రోజు తాగునీరు సరఫరా చేస్తున్నామని కొన్ని సమస్యలు ఉన్నా వాటిని కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావులాగా హామీలు ఇచ్చి మాట తప్పనని స్పష్టం చేశారు. 100 ఫీట్ల రోడ్, ఓవర్ బ్రిడ్జి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. సీఎం.రిలీఫ్ ఫండ్ ఇప్పటికి అనేక మందికి ఇప్పించానని మరికొన్ని మంజూరు కానున్నాయని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకువెళ్లాడాని విమర్శించారు. ఎన్నికల ముందు రూ.8,600 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించి కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ లా గా హామీలు ఇచ్చి మాటతప్పే నైజం కాంగ్రెస్‌ది కాదని అన్నారు. ఆరు హామీలు అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్, అసిస్టెంట్ మేనేజర్ దేవపాల పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నిరోధించాలని వినతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

అక్రమ నిర్మాణాలు నిరోధించలని బహుజన రక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబరు 250 లావుని పట్టాలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని 13వ వార్డ్‌లోని 250 సర్వే నెంబరులో గల 9 గుంటలు లావుని పట్టా దళితులకు కేటాయించింది. అప్పటి నుంచి అక్కడ దళితులు నివాసం ఉంటున్నారు. కానీ ఇటీవల లక్షెట్టిపేట మున్సిపాలిటీ కావడంతో ధరలు విపరీతంగా పెరిగాయి. దీన్ని ఆసరాగా చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తూ పేదల ను మోసం చేస్తున్నారు. అట్టి భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్లకు మున్సిపాలిటీ అధికారులు అనుమతులు మంజూరు చేశారని దళితులు వాపోయారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్దంగా అనుమతులు ఇవ్వకుండా చట్టా పరంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, రామిల్ల మురళి పాల్గొన్నారు.



ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని జైనథ్ మండల నాయకులు లింగారెడ్డి కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వార్థం కోసం పార్టీలు మారే వారి కంటే ప్రజలకు సేవ చేసే నాయకులకే ఆదరణ ఉంటుందన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అవిశ్రాంతంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 6న పార్టీ మహాసభను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, రోకండ్ల రమేష్, రమేష్ రెడ్డి, యాసం నర్సింగ్ రావు, ఊషన్న పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మున్నూరు కాపు సంఘం నూతన క్యాలెండర్‌ను శనివారం మాజీ మంత్రి జోగు రామన్న సంఘం నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐక్యంగా ఉంటూ సంఘం అభ్యున్నతికి పాటు పడాలని సూచించారు. తాలూకా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. సంఘంలో ఐక్యతను మరింతగా పెంపొందించుకోవడానికి బాధ్యులు కృషి చేయాలని, ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్, కోశాధికారి కైపెల్లి జైపాల్‌తో పాటు పలువురు మహిళా విభాగం నాయకురాళ్లు, గ్రామ, మండల కమిటీల బాధ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ల బదిలీలు

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఉన్నతధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేసిన రమేష్ బాబు సీఎస్‌బీ-4 రామగుండంకు, బెల్లంపల్లి వన్ టౌన్ పీఎస్‌లో పనిచేసిన బన్సీలాల్ శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే మంచిర్యాల్ రూరల్‌లో పనిచేసిన టి.సంజీవ్ ఏంజెడ్-1 ఆఫీస్‌కు బదిలీ కాగా అతని స్థానంలో సీసీఆర్బీ రామగుండంలో విధులు నిర్వహించే ఆకుల అశోక్ బదిలీ అయ్యారు.

జాతర వేలం పాట రూ.3.73 లక్షలు

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో నిర్వహించే మహాశివరాత్రి జాతర సందర్భంగా రూ.3.73 లక్షల వేలం పాట నిర్వహించగా వేలం పాటను కమాన గ్రామానికి చెందిన నగోసె భీంరావు దక్కించుకున్నారు. ప్రతి సంవత్సరంలాగా ఈ సంవత్సరం కూడా వేలం పాట నిర్వహించడం జరుగుతుందని శివకేశవ ఆలయం చైర్మెన్ గాదె ప్రవీన్‌కుమార్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ వేలం పాట నిర్వహించడం జరిగిందన్నారు. ఈ వేలంలో సర్పంచ్ బండె తుకారాం, ఉప సర్పంచ్ పవన్‌సాయి, కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహించేలా కృషి

నవతెలంగాణ-బోథ్

యువతను క్రీడాల్లో ప్రోత్సహించేలా కృషి చేస్తానని పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గాజుల పోతన్న అన్నారు. మండలంలోని సొనాల గ్రామంలోని యువకులకు క్రికెట్ బ్యాట్లు, వాలీబాల్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సాహించే ఉద్దేశంతో క్రీడా సామాగ్రి అందించామని తెలిపారు. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సాయి కృష్ణ, కార్యదర్శి పాటిల్ అమృతరావు, సలహాదారులు పాశెట్టి రమేష్, కసిరే పోతన్న, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దినేష్ కుమార్, నాయకులు లంక విజయ్, సంతోష్, సోన్న హరీష్, ఉదయ్ కిరణ్, కొండమడుగు హరీష్, క్రాంతి పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన నాయకులకు సమూచిత స్థానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

కాంగ్రెస్‌లో నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు, నాయకులకు సమూచిత స్థానం దక్కుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ అన్నారు. శనివారం ఎలక్ట్రానిక్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వెడ్మ బొజ్జును ఎమ్మెల్యేగా గెలిపించడమే అందుకు నిదర్శమన్నారు. వేల మంది కార్యకర్తల సమక్షంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేతుల మీదుగా సన్మానించబడడం జిల్లాకు దక్కిన గౌరవంగా బావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల సికింద్రాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన బూత్ కన్వీనర్‌ల సమావేశం విజయవంతం అయిందన్నారు. అగ్రనాయకత్వం సూచించిన విధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేసి అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ నాయకులు సమీర్, ఎస్‌కే అలీం, ఎం.మహేందర్, ఈ.సంతోష్, జి.వెంకన్న, అబ్దుల్లా పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్ భౌతిక కాయానికి మాజీ మంత్రి నివాళి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మున్సిపల్ మేనేజర్ దివాకర్ భౌతిక కాయానికి మాజీ మంత్రి జోగు రామన్న సంతాపాన్ని తెలియజేశారు. శనివారం అంబికానగర్‌లో భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న దివాకర్ మరణం చెందడంతో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

జాతీయ సదస్సులో పాల్గొన్న నిర్మల్ వైద్యులు

నవతెలంగాణ-నిర్మల్

కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో 61వ చిన్న పిల్లల వైద్య నిపుణుల జాతీయ సదస్సులో నిర్మల్ జిల్లా నుండి సీనియర్ చిన్న పిల్లల వైద్య నిపుణులు డా.అప్పాల చక్రదారి, డా.రమేష్ పాల్గొన్నారు. ఈ నెల 25 నుండి 28 వరకు సదస్సు కొనసాగుతుంది. ఇందులో దేశ, విదేశాల నుండి దాదాపు 7,500 మంది చిన్న పిల్లల వైద్య నిపుణులు పాల్గొన్నారు. చిన్న పిల్లలు, కౌమార దశలోని నవ యువతీ, యువకులకు వచ్చే అనేక వ్యాధుల గురించి సదస్సులో వివరించారు.

బుడుందేవ్‌కి పూజలు చేసిన మెస్రం వంశీయులు

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసుల ఆరాధ్యదైవం నాగోబాకు పూజలు చేసిన మెస్రం వంశస్థులు నాగోబా నుంచి ఉట్నూర్‌కు పయనమయ్యారు. శుక్రవారం మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో కొలువుదీరిన బుడుందేవ్‌కి సాంప్రదాయ బద్దంగా ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నుండి తీసుకవచ్చిన పవిత్ర జలాలతో బుడుందేవ్‌ను శుద్ధి చేసి పూజల చేశారు. అనంతరం జాతరను ప్రారంభించినట్లు ప్రకటించారు. అనంతరం ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్, వైస్‌ఎంపీపీ బాలాజీ, సర్పంచ్ మల్లిక, నాయకులు పాల్గొని, బుడుందేవ్‌కి పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండి లాభంగా ఉండాలని వేడుకున్నారు. మెస్రం వంశీయులతో మాట్లాడారు. జాతర శాంతియుతంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ మెస్రం నాగోరావు, జిల్లా సార్మేడి మెస్రం దుర్గు పటేల్, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

రైతుబంధు డబ్బులు షరతు లేకుండా అందించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

రైతుబంధు డబ్బులను ఎటువంటి షరతు లేకుండా రైతులకు అందించాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ సభ్యులు భరత్ చౌహన్, ఉట్నూరు జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని హస్నాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పెద్ద వ్యాపారస్తుల అప్పులు రూ.11లక్షల కోట్ల మాఫీ చేసిందని అన్నారు. కానీ ఒక్క రైతు రుణం కూడా మాఫీ చేయలేదన్నారు. రైతు రుణాలపైన ఉన్న వడ్డీని రైతుబంధు డబ్బులను ద్వారా వసూలు చేస్తే మరింత ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ జావిద్, నాగపూర్ సర్పంచ్ జాదవ్ సునీల్, నాయకులు పెందూర్ ప్రభాకర్ ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- **అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుభద్ర**

నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్రంలో పని చేస్తున్న అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేని యెడల మార్చి 1, 2, 3 తేదీ లో మూడు రోజుల పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తామని అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు జే సుభద్ర అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడి మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారని, వారంతా బడుగు బలహీనవర్గాలకు చెందినవారే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. గత 40 సంవత్సరాలకు పైగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. అయిన వారికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత, తదితర చట్టబద్ధ సౌకర్యాలు ఏవీ రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం లేదన్నారు. దీనివల్ల అంగన్‌వాడి ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని అన్నారు. మన రాష్ట్రం పక్కనే ఉన్న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని అన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో అంగన్‌వాడి ఉద్యోగులకు హెల్త్ కార్డులు అక్కడి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో అంగన్‌వాడి ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. మన తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడిలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. స్వయంగా సీఎం అంగన్‌వాడి వర్కర్‌లను అంగన్‌వాడి టీచర్‌గా మార్చారన్నారు. కానీ టీచర్‌లతో సమానంగా వేతనం ఇతర సౌకర్యాలు మాత్రం ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. టీచర్‌లతో సమానంగా వేతనం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రగతి భవన్ సమావేశంలో సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్‌వాడి ఉద్యోగులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి జిల్లా ఉపాధ్యక్షులు పంచశీల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంగన్న, జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు డి మల్లు, ప్రమీల, రజియా బేగం, సంగీత, లలిత, కల, సుమిత్ర, సుజాత మండలంలోని అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలపైన చర్చించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ ఫిబ్రవరి 3 నుండి జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలపైన మాట్లాడి తమ ఉద్యోగులకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని అన్నారు. వారిలో మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందినవారే అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. వారంతా గత 40 సంవత్సరాలకు పైగా ఐసీడీఎస్ లో విధులు నిర్వహిస్తూ, పేద ప్రజలకు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. అలాంటివారికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్‌ఐ ,ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధ సౌకర్యాలేవి ప్రభుత్వం కల్పించలేదని అసహనం వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, పాండిచ్చేరి ప్రభుత్వాలు అక్కడి అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించా రని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు కూడా అందజేశారని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండుగ బోనస్ సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఎలాంటి సౌకర్యాలకు అంగన్‌వాడీ ఉద్యోగులు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడి వర్కర్ పేరును అంగన్‌వాడీ టీచర్స్‌గా మార్చిన తోటి టీచర్లతో సమానమైన వేతనాలు, సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని అన్నారు. ప్రగతి భవన్ సమావేశంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. మినీ అంగన్‌వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తించాలని అన్నారు. వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలన్నారు. జీఓ నెంబర్ 14, 19, 8లను వెంటనే సవరించాలని అంగన్‌వాడి ఉద్యోగులకు ఆసరా, కల్యాణ లక్ష్మి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని కోరారు.

నిర్మల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సీడీపీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బీఎల్ఓ డ్యూటీల పేరుతో వేదిస్తు, మెమోలు ఇస్తు, భయబ్రాంతులకు గురి చేస్తున్న ప్రభుత్వం చర్యలను ఖండిస్తున్నామని అన్నారు. ప్రమాద బీమా రూ.10లక్షలు కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని అన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పక్కన ఉన్న కేరళ, తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాలు ఇస్తున్న తరహాలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ,పండుగ బొనస్‌లు, వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. అదనపు పనులు రద్దు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో డిమాండ్ల సాధనకు జనవరి 29, 30 తేదీలలో ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 14చలో హైదరాబాద్, మార్చి నెలలో 1, 2, 3 తేదీలలో సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు సుజాత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, లలిత, శైలజ, శశికళ, నర్సమ్మ, లావణ్య, రమ్య పాల్గొన్నారు.











కంటి వెలుగు శిబిరం తనిఖీ



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని గిమ్మ గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరంలోని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా అధిక మొత్తంలో స్క్రీనింగ్ చేయాలని సూచించారు. గ్రామంలో 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. గ్రామస్తులు కలెక్టర్‌ని శాలువాతో సత్కరించారు. ఆమె వెంట ఎంపీపీ గోవర్ధన్, ఎంపీటీసీ కోల భోజన్న, సర్పంచ్ కోల సుమ, నాయకులు కోల పరమేశ్వర్, తహసీల్దార్ రాఘవేంద్రరావు ఉన్నారు.

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎంత మందికి పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కంటి వెలుగు ఇన్‌చార్జీ డా.మెట్‌పెల్లి నయనతార, తహసీల్దార్ బడాల రాంరెడ్డి, బేల పీహెచ్‌సీ వైద్యుడు డా.వంశీకృష్ణ, సర్పంచ్ గోదురి భూమన్న, దీపక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ వేణుగోపాలకృష్ణ



నవతెలంగాణ-నిర్మల్

74వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ వేణుగోపాలకృష్ణ ఉత్తమ వైద్యాధికారిగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, జిల్లా పరిషత్ చైర్మెన్ విజయలక్ష్మి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. అత్యధిక పోస్టుమార్టంలు, ఇతర వైద్య సేవలకుగాను ఈ ప్రశంసలు దక్కాయి. ఇప్పటికి 25 సార్లు ఉత్తమ వైద్యాధికారిగా ఎంపికయ్యారు. ఇదిలా ఉండగా సంస్థల నుండి జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు, ప్రశంసలు దక్కించుకున్నారు. కాగా శుక్రవారం వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడించిన ఆదివాసులు



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనుడిపై అటవీశాఖ అధికారులు దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉట్నూర్ అటవీశాఖ కార్యాలయం ముందు తుడుందెబ్బ ఆధ్వర్యంలో ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్, మహిళ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి మాట్లాడుతూ అడవుల్లో జీవిస్తున్న ఆదివాసులు ఆడవులను రక్షిస్తున్నారని అన్నారు. అటవీశాఖ అధికారులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. అడవులు నరికే వారికి మేము పూర్తిగా వ్యతిరేకులమని అన్నారు. కాని అడవుల రక్షణ పేరుతో ఆదివాసులపై దాడులు చేసే వారి పట్ల తీవ్రంగా పరిగణిస్తామని అన్నారు. అలాంటి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడిలో గాయపడ్డ బాధిత కుటుంబానికి ఒక ఉద్యోగంతో పాటు లింబారావుకు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. ఆయన కుటుంబానికి వ్యవసాయ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖ అధికారులే కలప అమ్ముకుంటున్నారని, అక్రమ ఇసుక రావాణాలకు అనుమతులు ఇస్తున్నారని అన్నారు. ఇటీవల రెండు ఇసుక ట్రాక్టర్ల ప్రమాదాలలో ఇద్దరు ఆదివాసులు మృతి చెందారన్నారు. ఇసుక వ్యాపారులు అటవీ అధికారుల అండతో ఏజెన్సీలోని వలు ప్రాంతాలలో అక్రమంగా డంపు చేసి ఇసుక అమ్ముతున్నారని విమర్శించారు. గిరిజనుడైన లింబారావుపై దాడి చేసిన వారిని సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోనట్లయితే అటవీ అధికారులపై దాడులు చేస్తామని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు.

ముట్టడిలో ఉద్రిక్తత వాతావరణం..

అటవీ శాఖ కార్యాలయాన్ని తుడుందెబ్బ నాయకుల ముట్టడిలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ముందుగానే ఉట్నూర్, నార్నూర్ సీఐలు సైదారావు, ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులను మోహరించారు. ఆటోలు, ద్విచక్రవాహనాలలో ఆదివాసీ గిరిజనులు తరలిరావడంతో పోలీసులు ఏర్పాటు చేసిన బ్యారికేట్ల వద్దనే పోలీసులు ఆదివాసులను అడ్డుకున్నారు. మహిళ పోలీసులతో పాటు ఉట్నూర్ ఎస్సై భరత్ సుమన్ ఆదివాసీ మహిళలు దూసుక వెళ్లికుండా అడ్డుకున్నారు. దీనితో కాస్త ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ముట్టడి సందర్భంగా డీఎఫ్ఓ రాజశేఖర్ మాట్లాడుతూ సంఘటనపై పూర్తి విచారణ జరిపిస్తామని, దోషులు ఎవరైన శిక్షిస్తామని, గిరిజనుల హామీలను పరిష్కరిస్తామని పోడు భూముల కోసం కొత్తగా ఎవరు అడవులను నరకవద్దని, గిరిజనులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ ముట్టడిలో తుడుందెబ్బ నాయకులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

మార్కెట్‌కు వెళ్లి వచ్చేలోపు దొంగతనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అలా మార్కెట్‌కి వెళ్లి ఇలా వచ్చేలోపు దొంగతనమైన సంఘటన మావల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఓ ప్రభుత్వ టీచర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం మధ్యాహ్నం 3.50 నిమిషాల సమయంలో ఇంటికి తాళం వేసి మార్కెట్‌కి వెళ్లారు. తిరిగి సాయంత్రం 6:30 నిమిషాలకు ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. కాగా లోపలికి వెళ్లి చూడగా 17 తులాల బంగారం, 33 తులాల వెండి దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. శుక్రవారం మావల పోలీస్ స్టేషన్‌లో ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. వాటి విలువ సుమారుగా రూ.5 లక్షల 26 వేల 5 వందల రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని సుంకిడి, ఉండం గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధితో పాటు అనేక రంగాల్లో ముందుకు వెళుతున్న రాష్ట్రమని అన్నారు. సీఎం కేసీఆర్ మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఉన్నారని తెలిపారు. మొట్ట మొదటిసారిగా మండలంలోని ఉండం, సుంకిడి గ్రామాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా సీసీరోడ్ల నిర్మాణాలతో పాటు వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రూ.13 కోట్ల 48 లక్షలు మంజూరు కాగా రెండు కోట్ల నిధులు మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం మంజూరు చేస్తామని అన్నారు. ఉత్తర్వులు రాగానే పనులు మొదలుపెట్టాలని సర్పంచ్ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కంది పోచ్చుబాయి, గెల్ల మహేందర్, రాంబాయి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, రైతుబంధు నాయకుడు జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆశన్న, రాజేశ్వర్, గజానన్, అక్తర్, గంగాధర్, వెంకన్న, నారాయణ, ప్రకాష్, రామ్‌కిషన్, పల్లవి, ప్రసూన్‌రెడ్డి, సునీతరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా రేషన్ డీలర్ల ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆదిలాబాద్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు ప్రశాంతంగా నిర్వహించామని ఆర్డీఓ రమేష్ రాథోడ్ తెలిపారు. డివిజన్ పరిధిలో 27 చౌక ధరల దుకాణాల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఒక దుకాణానికి దరఖాస్తులు రాలేదని, మిగతా వాటికి రాత పరీక్ష నిర్వహించి, మెరిట్ ఆధారంగా 1:5 అభ్యర్థులను మౌఖిక పరీక్షకు పిలువడం జరిగిందని తెలిపారు. 117 మంది అభ్యర్థులకు గాను, హాజరైన 114 మందికి ఇంటర్వ్యూలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించామని తెలిపారు.

నాను మహారాజ్ మందిర నిర్మాణనికి భూమిపూజ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని బండరేవుతండాలో నాను మహరాజ్ మందిరం లింబ మహారాజ్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాదాయ శాఖ నుండి మంజూరైన రూ.28 లక్షల నిధులతో ఆలయ పునర్‌నిర్మాణం కోసం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, అడెల్లి ఆలయ చైర్మెన్ అయిటి చందు, ఎఎంసీ చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసిఆర్ ఆలయాల నిర్మాణం కోసం అధిక నిధులు కేటాయించారని మండలంలో సుమారు 160 నూతన మందిరాలు నిర్మాణాలు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ దత్తురాం, మాజీ ఏఎంసీ చైర్మెన్లు రాజ్ మహమ్మద్, దావోజి నాయక్, ఎంపీటీసీ మీరాబాయి, సర్పంచ్‌లు సురేఖ భాయ్ కైలాస్, ప్రహ్లాద్, పంచాయతీ రాజ్ డీఈ తుకారం పాల్గొన్నారు.

ఆదివాసులపై దాడులు పునరావృతం కాకుండా చూడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఆదివాసీలపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని కొలాం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కొడప సోనేరావు అన్నారు. శుక్రవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో డివిజినల్ ఫారెస్ట్ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆదివాసీ యువకుడిపై దాడికి పాల్పడ్డ ఫారెస్ట్ అధికారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టి అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. నార్నూర్ మండలం నాగల్‌కొండ గ్రామానికి చెందిన అమాయక ఆదివాసీ యువకుడుపై ఉట్నూరు పరిధిలోని ఫారెస్ట్ అధికారులు ఆ కారణంగా దాడిచేసి గాయపరచారని పేర్కొన్నారు. వెంటనే దాడికి పాల్పడ్డ అధికారులపై పూర్తిస్థాయి విచారణ జరిపించి శాఖ పరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. లేనిపక్షంలో అటవీశాఖ అధికారులను అడవిలోకి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. అమాయక ఆదివాసీలపై దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. అడవిలో ఆదివాసీ గిరిజనులకు ఎలాంటి హాని తలపెట్టకుండా నడుచుకోవాలని అటవీ అధికారులకు ఆదేశించాలని సూచించారు. కార్యక్రమంలో కుమురం యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్ర రాజు, కొలాం సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టేకం లక్ష్మణ్, కొలాం హక్కుల పోరాట సమితి నాయకులు మడవి గోవింద్‌రావు, నాయకులు సిడం పురుషోత్తం, అర్క శేషరావు, టేకం గణేష్, సిడాం శత్రుగన్, కేశవ్, కుమ్ర మోతీరాం, నగేష్ పాల్గొన్నారు.

న్యాక్ అక్రిడిటేషన్ సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం న్యాక్ అక్రిడిటేషన్ సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని యూనివర్సిటీ అభ్యాసక సహాయ కేంద్రం కోఆర్డినేటర్ ప్రతాప్‌సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాక్ నుంచి మెయిల్ వస్తుందని, ఆ మెయిల్స్‌కు తక్షణం స్పందించాలని సూచించారు. 20 ప్రశ్నలతో కూడిన మెయిల్ వస్తుందని, విద్యార్థులు కనీసం రెండు రోజులకోసారి మెయిల్స్ చూసుకోవాలని కోరారు. 'న్యాక్' అక్రిడిటేషన్ అసెస్మెంటులో భాగంగా యూనివర్సిటీ అందించే సేవలపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు న్యాక్ ప్రశ్నావళిని ఇమెయిల్ ద్వారా వస్తుందని మెయిల్ అందుకున్న విద్యార్థులు ఆ ప్రశ్నలకు తగిన జవాబులు గుర్తించి తిరిగి పంపాలని సూచించారు. సులువైన ఇంగ్లిషులో 20 ప్రశ్నలు ఉంటాయని, ఆయా ప్రశ్నల కింద ఉన్న సమాధానాల్లో ఒకదానిపై క్లిక్ చేయాలని, అన్ని ప్రశ్నల సమాధానాల పైన క్లిక్ చేశాక 'బిట్' పై క్లిక్ చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా అభ్యాసక సహాయ కేంద్రంలో సంప్రదించాలని కోరారు. న్యాక్ నుంచి విడతల వారీగా విద్యార్థులకు మెయిల్స్ వస్తాయని, క్రమం తప్పకుండా మెయిల్స్ చూస్తుండాలని సూచించారు.

కానిస్టేబుల్ వాహనం చోరీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కానిస్టేబుల్ ద్విచక్రవాహనం దొంగతనమైన సంఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జాఫరుద్దీన్ ఈనెల 25న తెల్లవారుజామున ఆదిలాబాద్ బస్టాండ్‌లో తన ఎపీ 01ఏజీ 4393 నెంబరు గల ద్విచక్రవాహనాన్ని పార్క్ చేసి, విధుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. తిరిగి అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో ఆదిలాబాద్ వచ్చారు. అయితే వాహనాన్ని పార్క్ చేసిన స్థలంలో చూస్తే అక్కడ వాహననం లేదు. దీంతో శుక్రవారం ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కంటి వెలుగు శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

- **మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్**

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లోని అంధత్వ నివారణే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమం ఉచిత కంటి పరీక్షలు చేపట్టిందని మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్‌లోని కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు నుంచి వృద్ధుల వరకు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వైద్యుల సూచనలు క్రమం తప్పకుండ పాటించాలని పేర్కొన్నారు. అవసరమైన వారికి మందులు, కండ్లజోళ్లు ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు ఉన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని ఆకోలి గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించనున్న రామాలయం నిర్మాణానికి డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. ఈ నిర్మాణానికై రూ. 30 లక్షలతో నిర్మించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ మాజీ చైర్మెన్ ప్రహ్లాద్, ఎంపీపీ గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతివెంకటరెడ్డి, వైస్‌ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంపీటీసీ బోజన్న, సర్పంచ్ కే వాణికేశవ్ పాల్గొన్నారు.

పశువుల షెడ్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కడెం

మండలంలోని అల్లంపెల్లి గ్రామాన్ని నిర్మల్ డీఆర్డీఓ విజయలక్ష్మి సందర్శించారు. చింతగుడెం ఐసీడీఎస్ సెంటర్‌లో పిల్లలకు పోషక పదార్థాలు అందించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ ప్రోగ్రాం ద్వారా అల్లంపెల్లిలో మేకల షేడ్, పశువుల షేడ్ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని ఉపయోగించుకొని పల్లెలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో జాదవ్ గోవింద్‌రావు ఏపీడీ బోస్, ఎపీఎం రాజారాం, సీసీ జ్యోతి, పీఓ జయదేవ్ పాల్గొన్నారు.

ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పాసైన నిరుద్యోగ ఎస్సీ అభ్యర్థులకు గ్రూప్ 2, 3, 4 ఉచిత శిక్షణకై ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని డిగ్రీ ఉత్తరులైన ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు 3 నెలల ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన ఎస్సీ అభ్యర్థులు ఈ నెల 31 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నెంబర్ 08752-224733, 9494149416 సంప్రదించాలని సూచించారు.

రిమ్స్‌లో పసికందు మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో అప్పుడే పుట్టిన పసికందు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఆందోళనకు దారి తీసింది. గుడిహత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామానికి చెందిన ఓ గర్భిణి డెలివరీ కోసం గత రెండు రోజుల కింద రిమ్స్‌లో చేరింది. అయితే వైద్యులు ఆమెకు గురువారం డెలివరీ చేయగా పాపకు జన్మనిచ్చింది. అయితే పుట్టిన పాప 1.8 కిలోల బరువు ఉండటంతో బరువు తక్కువతో పాటు శ్వాసకోస సమస్యతో బాధపడుతోంది. అయితే వైద్యులు గత రెండు రోజులుగా చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం పసికందు మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ పాప మృతి చెందిందని ఆరోపించారు.

తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాచర్ల మధు

నవతెలంగాణ - కాగజ్‌నగర్

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా సిర్పూర్(టి) మండలానికి చెందిన రాచర్ల మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించి ఎన్నిక నిర్వహించారు. గతంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న గోమంత్‌రెడ్డిని ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించడంతో నూతనంగా ప్రధాన కార్యదర్శిని ఎన్నుకున్నట్టు తపస్ జిల్లా గౌరవ అధ్యక్షులు తాటి రవీందర్ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ రంగస్వామి, రాచర్ల మధు వర్మ చేత ప్రధాన కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా గౌరవ అధ్యక్షులు తాటి రవీందర్, సంఘ నాయకులు మోర్ల మధుకర్, పోతురాజుల లక్ష్మణ్, రాజేందర్, ప్రవీణ్, మహేష్, మునిందర్, సురేష్ పాల్గొన్నారు.

కిష్టంపేటలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కోటపల్లి



చెన్నూర్ మండలం కిష్టంపేట రైతువేదికలో శుక్రవారం సర్పంచ్ బుర్ర రాకేష్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా చెన్నూర్ పట్టణ సీఐ హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిమ మెడికల్ వైద్య బృందం సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్లా రాంరెడ్డి, ఉపసర్పంచ్ ముకుందరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకిచ్చిన హామీలు నెరవేర్చాలి



నవతెలంగాణ-జన్నారం

ఎన్నికల సమయంలో గల్ఫ్ కార్మికుల కోసం రూ.500 కోట్లతో గల్ఫ్ బోర్డ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే హామీలను నెరవేర్చాలని రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శేపూరి గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమం సమితి క్యాలెండర్‌ను టిజిడబ్ల్యుడబ్ల్యుసి మండల అధ్యక్షులు పాలాజి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శి దుమ్మల ఎల్లయ్యను సేవలను గుర్తించి సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ కెసిఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మరిచిపోయారని, ఇప్పటికైనా వచ్చే బడ్జెట్ సమావేశాల్లో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆవిర్భావం నుండి కార్మికుల సమస్యల పట్ల నిరంతరం కృషి చేస్తూ వస్తోందని టీబీజీకేఎస్ నాయకులు ఐకే-1ఏ పిట్ సెక్రటరీ కె రత్నాకర్‌రెడ్డి అన్నారు. ఐకే 1-1 ఏ, ఐకే ఓపెన్ కాస్ట్ గని ప్రాంగణంలో శుక్రవారం టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. గని కార్మికులు నాయకులతో కలిసి జండా ఆవిష్కరించి మాట్లాడుతూ టీబీజీకేఎస్ ఏర్పాటు అనంతరం ఒకే దఫా 35వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ సంఘానికి దక్కిందని పేర్కొన్నారు. సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చొరవతో సింగరేణిలో మహిళలకు ఉద్యోగం సింగరేణి ఉద్యోగుల పిల్లలకు రెండవ ప్రసూతికి అవకాశం కల్పించామన్నారు. భవిష్యత్తులో సింగరేణి ఉద్యోగాల్లో యువతకు, మహిళలకు 35 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఇటీవల భూపాల్‌పెల్లిలో కల్వకుంట్ల కవిత ప్రకటించారని గుర్తు చేశారు. సింగరేణి గని కార్మికులు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను కవిత చొరవతో సీఎం కేసీఆర్ పరిష్కారం చూపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డి, సీనియర్ మైనింగ్ స్టాఫ్ నాయకులు అవినాష్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, భూమన్న, యాకూబ్ అలీ, సతీష్ కుమార్, అశోక్, హనుమంతు, కొండ వెంకటేష్ యువనాయకులు కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సోమగూడెంలో రెండు నెలల్లో ఓపెన్ జిమ్ ఏర్పాటు

నవతెలంగాణ - కాసిపేట

సోమగూడెం క్రీడా మైదానంలో రెండు నెలల్లో జిమ్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. శుక్రవారం సోమగూడెం భరత్ కాలనీలో ఆర్మీ చికెన్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు సోమగూడెం క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్ కోసం కోరగా ఎమ్మెల్యే స్పందిస్తూ మంజూరు చేశామని, రెండు నెలల్లో ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం సోమగూడెం సర్పంచ్ ప్రమీలా గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల ఏర్పాటుకు సోమగూడెంలోని రహదారికి ఆనుకొని రైలు పట్టాలకు, రహదారి మధ్యలో ఉన్న భూమిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ప్రభుత్వ పథకాలకు కేటాయించిన ఈ భూమిని కొంత మంది కబ్జాలు చేస్తున్నారని, ఈ భూమిని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కేటాయిస్తే స్థానికులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో పాటు సోమగూడెంలో సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇప్పించాలని కోరగా పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమగూడెం(బి) సర్పంచ్ ప్రమీలాగౌడ్, సోమగూడెం(కె) సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ రాంచందర్, బీఆర్ఎస్ నాయకులు రవితేజ, సిద్దయ్య, రాంచందర్, గోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలో తప్పులు సవరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల సీనియార్టీ జాబితాలో అనేక తప్పులున్నాయని, వాటిని సవరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం జిల్లా విద్యాధికారి అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియార్టీ జాబితాలో అనేక తప్పులున్నాయని, వాటిని సవరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జాబితా తయారు చేసేటప్పుడు డీఎస్సీలో సాధించిన ర్యాంక్ ఆధారంగా ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా విడుదల చేయాలన్నారు. 398 వేతనంతో పని చేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ సర్వీస్‌ను కలిపి పదోన్నతులు కల్పించాలన్నారు. అన్‌ట్రైన్డ్ ఉపాధ్యాయులు ప్రత్యేక విద్యావాలంటీర్ల సర్వీసులో పదోన్నతులను 2003 మార్చి 3 నుండి లెక్కించాలన్నారు. బెంగాలీ మాధ్యమం సీనియార్టీ జాబితా విడుదల చేయాలని, జాబితాలో కొంతమంది పేర్లు పూర్తిగా లేకపోవడం అన్యాయమని తెలిపారు. ఒకే చోట ఎనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవీ విరమణకు మూడు సంవత్సరాలు లోపు ఉన్న వారికి సంబంధించిన వివరాలను రిమార్క్స్‌లో చూపించాల్సి ఉన్నప్పటికీ ఆ పని చేయలేదని తెలిపారు. వాటిని పూర్తి ఖాళీగా చూపించారని తెలిపారు. అంతర్ జిల్లా పరస్పర బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు బదిలీ తేదీ నుండి సీనియార్టీని లెక్కించాలని కోరారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని నూతన జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి అడే ప్రకాష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పి-1 గనిలో చోరీ..?

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి-1 గనిలో దొంగతనం జరిగినట్లు సమాచారం. గురువారం రాత్రి ఎస్ఆర్పి1 గనిలో గుర్తు తెలియని వ్యక్తులు స్టోర్ రూమ్‌లోని సుమారు 60 వరకు కోల్ బిట్లను, కొంతమేర ఇతర మెటీరియల్ దొంగలించారు. ఇలాంటి సంఘటనలు పలుమార్లు చోటు చేసుకున్నాయని, అయినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దొంగతనానికి గల కారణాలను గుర్తించి, సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్
- కలెక్టరేట్ ఎదుట నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్‌తో కలిసి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అదనపు కలెక్టర్ రాజేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను బిఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందన్నారు. ఈ నిధుల కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేయాలని కోరారు. దారి మళ్లించిన నిధులు తిరిగి వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లైములను వెంటనే ఇవ్వాలని, 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పెన్షన్ 5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రకటించిన విధంగా కార్మికులకు మోటార్ సైకిళ్లు అందజేయాలన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తున్న కార్మికులకు నష్టపరిహారం ఆరు నుండి పది లక్షల పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులతో కూడిన వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీ నియమించాలన్నారు. కేంద్ర చట్టంలో ఉన్న విధంగా కార్మికులకు స్కాలర్‌షిప్ గృహవసతి, అడ్డాలలో మౌలిక వసతులు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ శ్రమ్ గుర్తింపు కార్డులను ప్రతి ఒక్క కార్మికుని అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్, మండల అధ్యక్షుడు కమలాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల అశోక్, నాయకులు రాంచందర్, రవి, సదయ్య, ఆనందరావు, సుభాష్, ఆశన్న, నరేష్, మనోహర్, రాజన్న, ఉదయ్, శంకర్, సత్యనారాయణ, తిరుపతి, రామకష్ణ, నరేష్, మహేష్ పాల్గొన్నారు.

దేవాపూర్ ఆశ్రమం వద్ద ఆదివాసీ సంఘాల ఆందోళన

నవతెలంగాణ - కాసిపేట



మండలంలోని దేవాపూర్ ఆశ్రమ పాఠశాల నుంచి 10 క్వింటళ్ల పాఠశాల బియ్యం అక్రమ తరలింపు సంఘటనపై హెచ్ఎం, వార్డెన్, ఏటీడీవో, డీటీడీవోలపై చర్యలు తీసుకోవాలని ఆశ్రమ పాఠశాల ముందు ఆదివాసీ సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. దేవాపూర్ ఆశ్రమ పాఠశాల 10 క్వింటాళ్ల బియ్యం జన్నారంలో పట్టుబడగా దేవాపూర్ ఆశ్రమ పాఠశాల బియ్యంగా బయట పడిందన్నారు. ఈ విషయమై ఆశ్రమ పాఠశాలను సందర్శించగా 21 క్వింటాళ్ల బియ్యానికి 11 క్వింటళ్ల బియ్యం పాఠశాలలో ఉన్నాయని, 10 క్వింటాళ్ల బియ్యం జన్నారంలో పట్టుబడ్డాయని తెలిపారు. హెచ్ఎం అందుబాటులో లేడని, ఉపాధ్యాయులను అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, విద్యార్థులకు కనీసం మెనూ కూడా పాటించడం లేదని పేర్కొన్నారు. అధికారులను వివరాలు అడిగితే పొంతన లేని సమాధానాలు చెప్తున్నారని, అధికారులకు కూడా వాటా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు రాష్ట్ర ఆడె జంగు, మడావి వెంకటేశ్, పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, మడావి అనంతరావు, కనక రాజు, ఆత్రం జంగు, మడావి వెంకటేశ్, కొమ్ముల బాపు, సిడాం గణపతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శంకుస్థాపన చేశారు. అచలాపూర్ పంచాయతీలోని గంపలపల్లి వద్ద రూ.18 లక్షల వ్యయంతో నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు. అదే పంచాయతీలోని గంపలపెల్లి, కొమ్ముగూడెం గ్రామాల బీటీ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా బోయపల్లి బోర్డు నుండి కాసిపేట వరకు మల్లన్న గుట్ట నుండి రేచిని రోడ్ వరకు రూ.93 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తుందన్నారు. మండలంలో సిఎస్ఆర్ నిధులతో ద్వారకాపూర్ కొత్తపల్లి బీటి రోడ్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. కిష్టంపేట బీటీ రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ నారాయణ, చలాపూర్ సర్పంచ్ దాగం శంకరమ్మ, కొలిపాక రంజిత్ కుమార్, మాజీ జెడ్పిటిసి సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలు చదువులో భాగమే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు క్రీడలు చదువులో భాగమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ రకాల క్రీడలను ప్రారంభించి, విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి కేంద్రీకరించాలన్నారు. క్రీడల్లో కనబరిచే ప్రతిభ ద్వారా గుర్తింపు వస్తుందని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్, అధ్యాపకులు శ్రీనివాస్, సంతోష్, సరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిత్యావసరాల కోసం టెండర్లు ఆహ్వానం

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలోని సబ్ జైల్‌లో 2023-24 ఏడాదికి నిత్యావసర సరుకుల సరఫరా కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు లక్షెట్టిపేట్ సబ్ జైలర్ తేజవత్ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యావసర వస్తువులైన కూరగాయలు, ఉల్లిగడ్డలు, టమాట, పచ్చి మిర్చి, ఆలుగడ్డలు, కోడిగుడ్లు, చికెన్, ఆకుకూరలు సరఫరా చేయడానికి ఆసక్తి గల వారికి జిల్లా సబ్ జైళ్ళ అధికారి, ఆదిలాబాద్‌లో ఫిబ్రవరి 4న టెండర్లు నిర్వహిస్తారన్నారు. టెండర్ల ఫారాలు, దరఖాస్తుల సమర్పణ జిల్లా సబ్ జైళ్ళ అధికారి, ఆదిలాబాద్‌లో ఉంటుందన్నారు. టెండర్ల స్వీకరణకు ఫిబ్రవరి 3 సాయంత్రం 5గంటలకు వరకు అవకాశం ఉంటుందని, ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు జిల్లా సబ్ జైళ్ల అధికారిని లేదా 90148 47478 లేదా 08739 233427లో సంప్రదించాలన్నారు.

అండర్ పాస్ పనులను పరిశీలించిన పీడీ రవీందర్

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో కొన్ని రోజుల నుండి నాలుగు వరుసల రహదారిలో భాగంగా నిర్మిస్తున్న అండర్ పాస్ వంతెన పనులను నిలిపివేయడంతో శుక్రవారం నేషనల్ హైవే పీడీ రవీందర్ పరిశీలించారు. స్థానికులతో చర్చించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న స్థలాన్ని మార్చి చౌప్పన్‌గూడ చౌరస్తా వద్ద అండర్ పాస్ వంతెన నిర్మించాలని సర్పంచ్ తుకారాం, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్‌లు, వ్యాపారవేత్తలు, గ్రామస్తులు పీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో చర్చించిన తర్వాతనే ఎక్కడ అండర్ పాస్ వంతెన నిర్మించాలనేది త్వరలోనే తెలియజేస్తానని అన్నారు. అనంతరం బంబారా గ్రామం వద్ద జరుగుతున్న రోడ్డు పనులు పరిశీలించడానికి వెళ్లారు. ఉప సర్పంచ్ బొయిరె ప్రకాష్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ నేతాజీ, స్థానికులు అండర్ పాస్ వంతెన లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ కూడా వంతెన నిర్మించాలని పీడీ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చౌప్పన్‌గూడ సర్పంచ్ అన్నిగ, సరండి సర్పంచ్ కమలాకర్, వాంకిడి ఉప సర్పంచ్ పవన్‌సాయి, సింగిల్‌విండో చైర్మన్ పెంటు, వ్యాపారవేత్తలు అవినాష్, శివ, మౌల్కార్ అశోక్, ప్రజలు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం 20వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గోలేటిలోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయం ముందు శుక్రవారం టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మాలోత్ శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ సాధనలో జరిగిన ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర ఎనలేనిదని అన్నారు. దీనికి టీబీజీకేఎస్ సింగరేణిలో యూనియన్‌గా ఉండటంగా మాత్రమే సాధ్యమైందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత దేశంలోని ఏ బొగ్గు గని కంపెనీలో లేని విధంగా సింగరేణి కార్మికులకు ఎనలేని హక్కులను సీఎం కేసీఆర్ అందించారన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికుల తరపున కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాజేందర్ మృతికి సంతాపం

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మృతి చెందిన బొమ్మెన రాజేందర్ సంతాప సభ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కమిషనర్ తన్నీరు రమేష్‌తో పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది రాజేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం చైర్మెన్, కమిషనర్ మాట్లాడుతూ రాజేందర్ కుటుంబానికి ఎల్లవేళలా తోడుగా ఉంటామని, ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా ఇప్పిస్తామని పేర్కొన్నారు. కుటుంబంలో అర్హత కలిగిన ఒకరికి ఉద్యోగం వచ్చేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఓ సతీష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగాపూర్ జాతర ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 4, 5, 6వ తేదీల్లో జరిగే జాతర ఏర్పాట్లను సీఐ నరేందర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధునయ్య, జుమ్మిడి ఆనంద్, ఈఓ బాపురెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యంతో కంటి పరీక్షలు నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ భారతిహోళికేరి



నవతెలంగాణ-జైపూర్

రెండవ విడత కొనసాగుతున్న కంటి వెలుగు పరీక్షలు నిర్దేశిత లక్ష్యంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భారతిహోళీ కేరి ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చిన వారితో వైద్య సేవలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో కంటి అద్దాలు పంపిణీ చేయాలని సూచించారు. గ్రామాల వారిగా దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించాలని, వారికి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహనా ర్యాలీ



నవతెలంగాణ-బెజ్జూర్

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని శుక్రవారం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. చిరుధాన్యాలలో పోషక విలువలు మెండుగా ఉంటాయని తెలిపారు. కార్బోహైడ్రేట్స్ ప్రోటీన్, మినరల్స్ తదితర పోషకాలు అధికంగా ఉంటాయని, మాంసాహారంతో పోల్చితే చిరుధాన్యాల్లో ప్రోటీన్ ఐరన్ ఎక్కువగా ఉంటుందని, మహిళలు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలను వాడుకుంటే రక్తహీతన బారిన పడకుండా ఉంటామని తెలిపారు. వీటిలో పుష్కలంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియ సమస్యలను దూరం చేయడంతో పాటు బరువు తగ్గేందుకు సహాయ పడతాయని పేర్కొన్నారు. రోజు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఎముకలు దృఢంగా ఉండడంతో పాటు గుండె పోటు, క్యాన్సర్ వంటివి రాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రాజుల నాయుడు, సర్పంచ్ ఏలది శారద, ఉప సర్పంచ్ దుర్గం శంకర్, ఎంపీటీసీ ఆత్రం సాయన్న, పంద్రం భిక్షమయ్య, లింగాల శంకరయ్య, ఏఈఓ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

కౌటాల : చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పించడానికి శుక్రవారం మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేష్ ఆధ్వర్యంలో తుమ్మిహేటి గ్రామంలో ర్యాలీ ర్వహించారు. అనంతరం సర్పంచ్ పోరెత్ రాందాస్ అధ్యక్షతన చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు పండించడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. 2023 సంవత్సరానికి చిరుధాన్యాల పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ఐక్యరాజ్యసమితి, అసెంబ్లీ తీర్మానించినట్టు ఏఓ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత సంవత్సరం వర్షాకాలంలో సబ్సిడీతో చిరుధాన్యాల విత్తనాలు పంపిణీ చేశాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అంజన్న, రైతుబంధు కమిటీ అధ్యక్షులు ప్రకాష్, రైతులు, రైతుబంధు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా టీబీజీకేఎస్ అవతరణ వేడుకలు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్‌కె-1ఏ గనిపై శుక్రవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అవతరణ దినోత్సవ వేడుకలను ఫిట్ సెక్రటరీ బండారి భిక్షపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను జీఎం కమిటీ సభ్యులు కె.సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించి, కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం కె.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ నాయకత్వంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆవిర్భవించిందన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ జయశంకర్ బాటలోనే నడుస్తూ వారి ఆశయాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు హెచ్.రవీందర్, చేగొండ రాజయ్య, ఆడెపు రాజయ్య, చీఫ్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు కొల్లే కొమురెల్లి, అసిస్టెంట్ సెక్రటరీ వి.శివ, సేఫ్టీ కమిటీ సభ్యులు ఈరగోని సదయ్య, వాసంశెట్టి సుధాకర్, కార్మికులు పాల్గొన్నారు.

డాబాను సందర్శించిన జెడ్పీ సీఈఓ రత్నకుమారి

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని డాబా గ్రామ పంచాయతీని జెడ్పీ సీఈఓ రత్నకుమారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా డాబా పంచాయతీని ఉమెన్స్ ఫ్రెండ్లీ (మహిళా స్నేహపూరిత) గ్రామపంచాయతీగా ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో మహిళలు స్నేహపూరితంగా ఉండి గ్రామ పంచాయతీని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు, మహిళా సాధికారతకు గ్రామసభల ద్వారా గ్రామస్తుల సహకారంతో ప్రణాళిక తయారు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలోని మహిళలతో మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీలో జరుగుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ శివకుమార్, గ్రామ సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
శనివారం 28 జనవరి 2023

నాగోబా సన్నిధిలో జన జాతర

ఇంద్రవెల్లి: రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన రెండో అతిపెద్ద జాతర నాగోబా జాతరకు శుక్రవారం భక్తులు జిల్లా నలుమూలల ప్రజలే గాక, మహారాష్ట్ర నుంచి భక్తులు తండోప తండాలుగా తరలి వచ్చారు. భక్తులు ముందుగా నాగోబా దర్శనం అనంతరం జాతరను తిలకిస్తున్నారు. ఆర్టీసీ వారు బస్సు సౌకర్యాలు కల్పించడంతో భక్తులకు సులువుగా జాతరకు చేరుకుంటున్నారు. జాతరలో గిరిజనులకు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలకు ఆటల, పాటల ద్వారా ప్రచారం నిర్వహించారు. జాతరకు తమ కుటుంబంతో వచ్చిన ప్రతి ఒక్కరూ పిల్లల ఆటవస్తువులు కొనుగోలు చేస్తున్నారు. జాతరలో దొరికే తినుబండారాలను ఆస్వాదిస్తున్నారు. ఈ జాతర అధికారికంగా శనివారంతో ముగియనుంది.



రేపు పద్మశాలి సంఘం వధూవరుల పరిచయ వేదిక

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి నూతన వధూవరుల పరిచయ వేదిక సింగరేణి గార్డెన్(ఓల్డ్ కమ్యూనిటీ హాల్)లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు సింగరేణి పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సదానందం తెలిపారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆదివారం నిర్వహించే పద్మశాలి వధూవరుల పరిచయ వేదికను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరిచయ వేదికకు వధూవరులు తల్లిదండ్రులతో రావాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు రాజేశం, సంజీవ్, రాములు పద్మ పాల్గొన్నారు.

కరెంట్ కోసం రైతుల రాస్తారోకో

నవతెలంగాణ-తలమడుగు

కరెంట్ కోసం రైతులు రాస్తారోకో చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట తలమడుగు, కొత్తూరు, డోర్లీ గ్రామాల రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులకు 24గంటలు ఉచిత కరెంటు అందిస్తామంటూనే రైతులను మోసం చేస్తున్నాడని అన్నారు. రబీ పంటలో వందల ఎకరాలలో వివిధ రకాల విత్తనాలు నాటుకొని గత నాలుగు రోజుల నుండి వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్తు త్రీఫేస్ సరఫరా నిలిపివేయడంతో రబీ పంటలు కండ్లముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు సరఫరాలో ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా వారికి ఇష్టం వచ్చినట్లు సరఫరా చేస్తున్నారని రైతులు తెలిపారు. త్రీఫేస్ విద్యుత్తు సరఫరా సమయం తెలపకుండానే విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదని మండిపడ్డారు. దాదాపు రెండు గంటలు రైతులు రోడ్డుపై బైఠాయించడంతో మండల కేంద్రానికి వచ్చే అధికారులు వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవళిక సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎస్ఈ, డీఈ మాట్లాడగా వెంటనే రాస్తారోకో సంఘటన స్థలానికి ఏఈ సతీష్ చేరుకొని రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఈ సతీష్ మాట్లాడుతూ పై అధికారుల ఆదేశాలను పాటిస్తామని మండల రైతులు ప్రజలు సహకరించాలని కోరారు. రాస్తారోకో కార్యక్రమంలో కిసాన్ సంఘ్ రాష్ట్ర నాయకులు భూమారెడ్డి, గ్రామ రైతులు నల్ల పద్మాకర్ రెడ్డి, రావుల ప్రేమేందర్‌రెడ్డి, గంగన్న, స్వామి, వెంకట్‌రెడ్డి, నవీన్, నారాయణ, గంగా రెడ్డి, జబ్బర్, మల్లేష్ పలువురు రైతులు పాల్గొన్నారు.



తాంసి : తెలంగాణ రాష్ట ప్రభుత్వం రైతులకు ఇరవై నాలుగు గంటలు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జామిడి రైతులు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందర గల రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షులు భూమరెడ్డి మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం రైతులకు ఇరవై నాలుగు గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వేసవి కాలం పంటలకు విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తుందని అన్నారు. వేసిన పంటలకు నీళ్ల లేక ఎండి పోతున్నాయని అన్నారు. విద్యుత్ అధికారులను అడిగితే అధిక లోడ్ కారణంగాపై అధికారుల ఆదేశాలతో త్రీఫేస్ తీయడం జరుగుతుందని పొంతన లేని సమాధానాలు కిందిస్థాయి అధికారులు చెపుతున్నారని అన్నారు. వెంటనే రైతులకు ఇరవై నాలుగు గంటలు విద్యుత్ సరఫరా చేసి, పంటలను కాపాడాలని లేని యెడల జిల్లా కేంద్రంలో ధర్నా రాస్తారోకో నిర్వహిస్తామని అన్నారు. సంఘటన స్థలానికి తాంసి పోలీసులు చేరుకుని, విద్యుత్‌శాఖ ఏఈతో మాట్లాడి రైతులను సముదాయించి రాస్తారోకో విరమింప జేశారు.

జార్‌హత్నూర్ : త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని మండల రైతులు స్థానిక సబ్ స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు రాత్రి వేళల్లో విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక అయోమయంలో ఉన్నామని అన్నారు. త్రీఫేస్ విద్యుత్ ఉదయం నుండి రాత్రి వరకు 12 గంటలు ఇస్తే సరిపోతుందని, తమ అవసరాలు తీరుతాయని పేర్కొన్నారు. కానీ విద్యుత్ శాఖ రాత్రిల్లో సమయపాలన లేకుండా విద్యుత్ ఏ సమయానికి వస్తుందోనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్‌శాఖ ఏఈ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు బాలగోవింద్, పడిపెలి మహేశ్, గిద్ది లక్ష్మణ్, సూది వినాయక్, నందు, రాజేందర్ పాల్గొన్నారు.



తాంసిలో..



బజార్‌హత్నూర్‌లో..

నాగోబా అభివృద్ధికి ట్రైకార్ ద్వారా సహకారం అందిస్తాం : రాంచందర్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

నాగోబా దేవాలయ అభివద్ధికి, భక్తుల సౌకర్యార్థం ట్రైకార్ ద్వారా సహకారం అందిస్తానని ట్రైకార్ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్ రాంచందర్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన జెడ్పీచైర్మెన్ రాథోడ్ జనార్ధన్‌తో కలిసి నాగోబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ మెస్రం తుకారాం వారికి శాలువాతో ఘనంగా సన్మానించి, నాగోబా మోమెంటోను అందజేశారు. మెస్రం నాయకులు శేఖర్, ఆలయ కమిటీ చైర్మెన్ నాగోబా ఆలయాభివృద్ధికి సహకారం అందించాలని విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. నాగోబా ఆవరణలో పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని ట్రైకార్ ద్వారా ఒక ట్రాక్టర్, రుణ సహాయం కింద అవసరమైన టెంట్లు, భక్తుల సౌకర్యార్థం ఒక షెడ్డును నిర్మించడానికి రుణసహకారం అందిస్తానని హామీనిచ్చారు. జీసీసీ జనరల్ మేనేజర్ వాల్యా నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అధ్యాత్మిక కేంద్రంగా వెలసిన మెస్రం వంశీయుల నాగోబా దేవాలయం చరిత్రలో నిలిచి పోయిందన్నారు. ఆ నాగోబా ఆశీర్వాదంతో ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఐటీడీఏ పాలకమండలి చైర్మెన్ కనక లక్కేరావు, జీసీసీ ట్రైకార్ జీఎం శంకర్‌రావు, డీఎం సీతారాం, మర్సకోల తిరుపతి, మెస్రం నాగనాథ్ ఉన్నారు.

సాగునీటి సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

రైతులు పండించే పంట భూములకు సాగునీటి సమస్య లేకుండా చూడాలని పూర్తి ఆయకట్టు వరకు నీరు అందే విధంగా సమస్యలు పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గోపి నర్సయ్య అన్నారు. శుక్రవారం విశ్రాంతిభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖానాపూర్, కడం, మండలాలకు చెందిన డి-27, 28, సదర్మాట్ రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని డి-27 కెనాల్ ఉపకాలువలకు మరమ్మతులు, చేయాలని అన్నారు. ఖానాపూర్ మండలంలోని కొమ్ముతండ, ఇప్పమడ, తుమ్మగూడెం, పాతఎల్లాపేట్, కడం మండలంలోని కడం పెద్దూర్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సదర్మాట్‌కు నేరుగా వేరే కెనాల్ లింకు చేయుటకు శనివారం అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశం పీఆర్టీయూ భవనంలో జరుగుతుందనీ అన్నారు. ఈ సమావేశానికి అన్ని రైతు, రాజకీయ, ప్రజా, కుల, విద్యార్థి, సంఘాలు, ప్రజాప్రతినిధులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు, రైతులు, అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు, గోనెస్వామి, జి.ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేష్ ఉన్నారు.

చిరుధాన్యాల సాగు..లాభాలు బాగు



నవతెలంగాణ-సిరికొండ

రైతులు చిరుధాన్యాలను సాగు చేయడం వల్ల మంచి లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జాదవ్ కైలాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని సోంపల్లి గ్రామంలో రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిరుధాన్యాలను సాగు చేయడం వల్ల మంచి లాభాలను ఆర్జించడంతో పాటు, సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని అన్నారు. తమ జీర్ణశక్తిని, గుండెకు సంబంధించిన వ్యాధులు దరికిరాకుండా కాపాడుతాయని రైతులకు సూచించారు. ఈ పంటలను బీడు భూముల్లో సాగు చేయవచ్చని, తక్కువ సమయంలో పంటలు చేతికి వస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కూడా చిరుధాన్యాలను సాగు చేసే విధంగా చూడాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, ఉపసర్పంచ్ జాకు, గ్రామ కోఆర్డినేటర్ విలాస్, ఈశ్వర్, కిషన్, సుధాకర్ పాల్గొన్నారు.

ఖానాపూర్ వైద్యునికి ఉత్తమ పురస్కారం



ఖానాపూర్ : ఖానాపూర్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాకేష్ ఉత్తమ వైద్యునిగా ఎంపికయ్యారు. ఖానాపూర్‌లో వైద్య వృత్తిలో ఉత్తమ సేవలందించినందుకు గాను 74వ గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు.

పరీక్షల సమయంలో విద్యార్థులు భయపడొద్దు

ఆదిలాబాద్‌టౌన్ : పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిళ్లను ఏలా జయించాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిశ నిర్దేశం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నార్. శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 6వ పరీక్షపై చర్చ కార్యక్రమంలో విద్యార్థులతో ఆన్‌లైన్ ద్వారా ముఖముఖి నిర్వహించారు. కాగా పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో పాయల్ శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ప్రధాని సూచనలను వీక్షించారు. ఈ సందర్భంగా పాయల శంకర్ మాట్లాడుతూ దేశాభివృద్ధితో పాటు యువతకు మార్గదర్శనం చేసేల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలన ఉందన్నారు. అదే విధంగా పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిళ్లకులోనై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు. ప్రణాళిక బద్ధంగా, ఒత్తిళ్లలను ఛేదిస్తు ఏ విధంగా ముందుకు సాగాలో విద్యార్థులకు ప్రధాని దిశా నిర్దేశం చేయడానికి పరీక్షపై చర్చ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు భరోసా ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, ముకుంద్ ఉన్నారు. అటు సీబీఆర్ పాఠశాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఆమె ప్రధాన మంత్రి ప్రసంగాన్ని, సూచనలు, సలహాలను ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. యువకులు, విద్యార్థుల్లో ఒత్తిడి లేని వాతావరణాన్ని సృష్టించడానికి ప్రధాన మంత్రి పరీక్షపై చర్చ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆరోసారి విద్యార్థులతో సమావేశం నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారని పేర్కొన్నారు.

మున్సిపల్ అభివృద్ధి పనుల్లో ప్రోటోకాల్ గొడవ

- అభ్యంతరం తెలిపిన కాంగ్రెస్ కౌన్సిలర్లు
- మండిపడిన ఎంపీ వెంకటేష్ నేత
- రౌడీ నాయకులు అంటూ హెచ్చరిక
- ప్రోటోకాల్‌పై కమిషనర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

నవతెలంగాణ-మంచిర్యాల

కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల విషయంలో అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడం రాజకీయ గొడవకు దారి తీసింది. అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దారి తీసిన సంఘటన శుక్రవారం మంచిర్యాల మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. టూటౌన్ ప్రాంతమైన హమాలీవాడలో సుమారు రూ.9 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. ఈ పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ పూదరి సునీత పేరు లేకపోవడం గొడవకు కారణమైంది. ఆమె భర్త పూదరి ప్రభాకర్‌తో పాటు కౌన్సిలర్ మాజీద, సల్ల నరేష్, రామగిరి బానేష్ అభ్యంతరం వ్యక్తం చేయగా ఈ విషయమై ఎమ్మెల్యే జోక్యం చేసుకొని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొరపాటు సరిదిద్దాలని సూచించారు. అనంతరం సభా వేదిక వద్ద మరోసారి కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా ఎంపీ వెంకటేష్ నేత జోక్యం చేసుకోని వారిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రౌడీ నాయకులు అంటూ మండిపడుతూ సరైన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని పరిస్థితిని అదుపు చేశారు.



అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు ః ఎంపీ, ఎమ్మెల్యే

నియోజకవర్గంతో పాటు అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు విమర్శలు చేస్తున్నారని ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మెడికల్ కాలేజీ విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావును ఉద్దేశించి ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, కమిషనర్ బాలకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భుమేష్, కౌన్సిలర్లు నల్ల శంకర్, పోరేది రాజు, శ్రీరాముల సుజాతమల్లేష్, నాయకులు విజిత్‌రావు, ఖాజామియా, గోగుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి నిధులు సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ బి.రాహుల్



నవతెలంగాణ-భీమారం

అభివృద్ధి నిధులను గ్రామ పంచాయతీలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఎల్కేశ్వరం గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీకి నూతన భవనం మంజూరైందన్నారు. భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సర్పంచ్ కొడిపే సమ్మయ్యకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ నర్సరీ, పల్లె ప్రకతి వనం, డంపింగ్ యార్డు, పారిశుధ్య పనులను పరిశీలించారు. సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో ఓడిఎఫ్ కింద చేపట్టిన పనులను పర్యవేక్షించడంతో పాటు నర్సరీ దగ్గర గల ఒర్రెపై ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కల్వర్టు నిర్మించాలని, అందుకోసం ఉపాధి హామీ ఏపిఓను ఆదేశించినారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఏ.ఫణీందర్‌రావు, మండల పంచాయతీ అధికారి కె.సతీష్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ రవి, ఉపాధి హామీ ఏపిఓ ఎస్తర్ డేవిడ్, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సవ్య, టెక్నికల్ అసిస్టెంట్ శివాజీ పాల్గొన్నారు.

నేటితో నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమిస్తున్నాం



నవతెలంగాణ-నస్పూర్

ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు లక్ష్యాలను శనివారం సింగరేణి వ్యాప్తంగా మొదటగా ఆర్కే6 గని అధిగమిస్తున్నట్లు ఆర్కే5,6 గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ ఇ.తిరుపతి తెలిపారు. శుక్రవారం గనిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 1.80 లక్ష మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికిగాను శనివారంతో 100 శాతాన్ని చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 63 రోజులు మిగిలి ఉండగానే ఈ లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. గత సంవత్సరం కూడా ఆరు రోజులు మిగిలి ఉండగానే నిర్దేశించిన మూడు లక్షల మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 100 శాతాన్ని పూర్తి చేశామని అన్నారు. లక్ష్యాన్ని అధిగమించడానికి తోడ్పడిన కార్మికులను అధికారులను యూనియన్ నాయకులను అభినందించారు. కోల్ డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో లక్ష్యాలను ముందుగానే చేరుకొని, లాభాలను అధిగమించడానికి సీ అండ్ ఎండి దిశా నిర్దేశంలో ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో ఉపరితల గనిగా మారుతుందని, ప్రతి సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలను ముందుగానే చేరుకొని కంపెనీ లాభాల్లో పాలుపంచుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి శ్రీనివాస్, ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

'బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారు'

నవతెలంగాణ-ఖానాపూర్

బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణగా బీఆర్ఎస్ ప్రభుత్వం మారుస్తోందని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు తిలక్ రావు అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నీళ్ల, నిధులు, నియామకాలపై ఎందరో పోరాడి తెచ్చుకున్న తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. కృష్ణా జలాల సమాన వాటా, రాష్ట్రంలో పెండింగ్ ఉన్న ప్రాజెక్టుల సాధనకై తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో కృష్ణా నది జలాల పంపిణీలో న్యాయమైన వాటా సాధన కోసం ఢిల్లీలో జంతర్ మంతర్‌లో జనవరి 30న దీక్ష కార్యక్రమం, 31 నా సెమినార్ జరుగుతుందనీ అన్నారు. ఈ దీక్షకు తెలంగాణ సబ్బండా వర్గాల ప్రజలు జన సమితి పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు. ఈ సమావేశంలో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తర్రా భీమ్‌రావు, కళ్యాణ్, బెన్నీ, సతీష్, కిషన్, విజయ్, రాహుల్, నరేష్ ఉన్నారు.

తోటి స్నేహితునికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వాడ్యాల గ్రామానికి చెందిన రమణ గత కొంత కాలంగా మూత్రపిండాల సమస్యతో డయాలసిస్ చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్నయ 1989-90బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు తన స్నేహితునికి అండగా నిలిచి రూ.9వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. మేమున్నామని స్నేహితుడి కుటుంబ సభ్యులకు, భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజన్న, రవీందర్‌రెడ్డి, చిలుక లక్ష్మణ్, తోట రాజేశ్వర్, శ్రీనివాస్, ఎస్.గంగన్న, సనత్, శివరాం పాల్గొన్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జపాన్ దేశంలో పని చేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్షను రిమ్స్ నిర్వహించారు. శుక్రవారం ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో టామ్కమ్ కంపెనీకి చెందిన ప్రతినిధులు నర్సింగ్ విద్యార్థులకు ఉద్యోగాల గురించి వివరించారు. కంపెనీ మేనేజర్ శబన, హెచార్, శ్రావణి జపాన్‌లో చేసే విధులు, వేతనం, శిక్షణ తదితర వాటి గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం వారికి స్క్రీనింగ్ పరీక్షను నిర్వహించారు. కొవిడ్ తరువాత ఆరోగ్యపరంగా భర్తీలపై తమ కంపెనీ దృష్టి సారించిందని, అదే సమయంలో జపాన్ ప్రభుత్వం నర్సుల కోసం ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుందుని టామ్కమ్ కంపెనీ మేనేజర్ శబన తెలిపారు. నర్సుల భర్తీ కోసం అర్హులైన వారిని ఎంపిక చేయడానికి నర్సింగ్ కళాశాలలో అవగాహన కల్పించి పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ఇక్కడ ఎంపికైన వారికి ఆరు నెలల పాటు జపాన్ లాంగ్వేజ్‌పై శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి కిరణ్ కుమార్, జూనియర్ ఉపాధి కల్పన అధికారి విజయ లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని షీటీం ఇన్‌చార్జ్ ఏఎస్సై సునీత సూచించారు. ఆడ పిల్లలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలలో డైట్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై సునీత మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేసిన వెంటనే భయపడకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరాలు, 1930 నెంబర్ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, క్యూఆర్ కోడ్, ఫోక్స్ యాక్ట్, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురైన వెంటనే షీటీమ్ నెంబర్ 8712659953 ఫోన్ చేయాలని సూచించారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో వేరు వేరుగా సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లా లోని ప్రతి ఒక్క కార్యకర్త పోలింగ్ బూత్‌స్థాయిలో పర్యటించి, కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రచారం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతి, నిరంకుశ పరిపాలనను ప్రతి ఒక్క రైతుకు, యువకులకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అనిల్, మండల ఉపాధ్యక్షులు రంజిత్, రాపని గంగాధర్, కంకల్ల రవి, అల్లూరి రాజు, కొమ్ము సుమన్, నవీన్, రాజేందర్, నరేష్, శేకర్, లింగన్న, నర్సయ్య, వినోద్ రాకేష్, శేఖర్, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.